## దటీజ్ తెలంగాణ

లౌకిక పాలన, అన్ని మతాలు, కులాలు, వర్గాలు, జాతులకు సమాన గౌరవం, సంక్షేమం, అందరి మధ్య సహృదయత, స్నేహాల పెంపు *తెలంగాణ సొంతం*.. లౌకిక వ్యతిరేక విధానాలు, ఇతర మతాలు,కులాలు, వర్గాలు, జాతులు రాజకీయ వర్గాల పట్ల విద్వేషం.మత మౌఢ్యం పెంపు. ప్రజలను విడదీసి పాలించే బ్రిటిష్ సిద్ధాంత ఆచరణ, రాజకీయ లబ్ధికి ద్వేషపూరిత వాతావరణ సృష్టి, అలజడి, అల్లర్లు, హింస.. ***బీజేపీ అభిమతం.***

**సంక్షేమం**

టీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమాన్ని, ఆర్థిక కష్టాలను దృష్టిలో ఉంచుకొని వాళ్లడిగిన 43 శాతం వేతన ఫిట్మెంట్ కంటే ఒక శాతం అదనంగా 44 శాతం ప్రకటించి కేసీఆర్ సంచలనం సృష్టించారు. ఇటీవలే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం కూడా చేశారు.

**ఆర్టీసీ ఉద్యోగులకు ఫిట్మెంట్**



## పారిశ్రామిక విప్లవం.. ఉపాధి తరంగం



| 2014 కు ముందు రాష్ట్రంలో పరిశ్రమల పరిస్థితి | 2014 తర్వాత తెలంగాణలో |
|---|---|
| తెలంగాణలో పరిశ్రమలు సుమారు 12,000 | కొత్తగా ఏర్పాటైన పరిశ్రమలు 23,000 |
| పారిశ్రామిక రంగానికి కేటాయించిన బడ్జెట్ రూ.300 కోట్లు | కేటాయించిన బడ్జెట్ రూ. 5,000 కోట్లు (2023-24) |
| పరిశ్రమల ఏర్పాటుకు అందించిన ప్రోత్సాహకాలు రూ. 200 కోట్లు (2014-15) | తొమ్మిదేండ్లలో అందించిన ప్రోత్సాహకాలు రూ. 9,500 కోట్లు |
| పరిశ్రమలకు రోజూ సరఫరా చేసే కరెంటు సగటున 5 గంటలు | సరఫరా చేస్తున్న కరెంటు 24 గంటలు |
| కరెంటు లేక మూతపడిన పరిశ్రమలు సుమారు 10,000 | కరెంటు లేక మూతపడిన పరిశ్రమలు - 0 |
| పారిశ్రామిక రంగంలో ఉపాధి పొందినవారి సంఖ్య 6,64,000 | ఉపాధి పొందుతున్నవారు 17.77 లక్షలు |
| | ఇప్పటివరకు వచ్చిన పెట్టుబడులు రూ. 2.65 లక్షల కోట్లు |
| | ఎస్సీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు రూ. 1,400 కోట్లు |
| | పరిశ్రమల కోసం ప్రభుత్వం నిర్ధారించిన భూమి 1.45 లక్షల ఎకరాలు |
| | ఇప్పటివరకు కేటాయించింది 28,000 ఎకరాలు |

**ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన టీఎస్ఐపాస్**



**ఓఆర్ఆర్ @ గ్రీనరీ..**

*జవహర్‌లాల్ నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు పచ్చదనంతో కళకళలాడుతున్నది. హరితహారంలో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే అనేక చెట్లు పెంచుతుండగా, హెచ్ఎండీఏలోని అర్బన్ ఫారెస్ట్రీ వింగ్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్‌లు ఓఆర్ఆర్ చుట్టుపక్కల పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నాయి. 2022 ఏదాదికి సంబంధించి 'ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హార్టికల్చర్ ప్రొడ్యూసర్స్' హైదరాబాద్‌కు 'వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డు'ను ప్రకటించింది.*



కొనసాగుతున్న సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణ పనులు

# ట్విన్ హెల్త్ సిటీ

## సమగ్ర వైద్య కేంద్రంగా చారిత్రక ఓరుగల్లు

- రూ.1,100 కోట్లతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
- 24 అంతస్తుల్లో సకల వసతులతో నిర్మాణం
- 35 విభాగాల వైద్య సేవలు అందుబాటులోకి
- రాత్రీపగలు శరవేగంగా నిర్మాణం

**35** విభాగాలు.. **77** యూనిట్లు..
**500** మంది వైద్యులు..
**1,000** మంది నర్సులు..
**24** అంతస్తుల భవనం..
**200** ఎకరాల సువిశాల ప్రాంగణం..
**1,100** కోట్ల రూపాయల ఖర్చు..
ట్విన్ సిటీస్ ప్రజల స్వప్నం..
ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం..
దేశంలోనే అతిపెద్ద దవాఖాన నిర్మాణం..
హెల్త్ సిటీగా చారిత్రక ఓరుగల్లు నగరం.

**చారిత్రక నగరం వరంగల్ హెల్త్ సిటీగా మారుతున్నది. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ దవాఖానను వరంగల్‌లో కేసీఆర్ సర్కారు నిర్మిస్తున్నది. రూ.1,100 కోట్లతో 24 అంతస్తులు, అత్యాధునిక హంగులతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రూపుదిద్దుకుంటున్నది. దీనికి 2021 జూన్21న ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేయగా, పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం 35 విభాగాల ద్వారా వైద్యసేవలు అందించేలా ప్రణాళికలు చేశారు. గుండె, కాలేయ మార్పిడి ఆపరేషన్లతో పాటు క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన కీమోథెరపీ, రేడియేషన్ వంటి అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉంటాయి.**

వరంగల్‌లో హెల్త్ సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో ఇప్పటికే కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. వరంగల్‌ను అత్యాధునిక వైద్య సేవల కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా 2014లో సీఎం కేసీఆర్ ఇక్కడ రాష్ట్రంలోనే ఏకైక హెల్త్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా పేరు పెట్టారు. అనంతరం ఐదు ఎకరాల్లో రూ.25 కోట్లతో ఐదు అంతస్తులతో 69 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో అత్యాధునిక భవనాన్ని నిర్మించారు. ఈ భవనం పక్కనే ఉన్న స్థలంలో ఇప్పుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు సాగుతున్నాయి. వరంగల్‌లోని ఎంజీఎం హాస్పిటల్, కాకతీయ మెడికల్ కాలేజీ, కంటి దవాఖాన, సెంట్రల్ జైలు స్థలం కలిపి 200 ఎకరాల వరకు అవుతుందని.. ఆ ప్రాంతాన్ని ఇంటిగ్రేటెడ్ హెల్త్ కాంప్లెక్సుగా అభివృద్ధి చేయనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీనిలో భాగంగానే వరంగల్ నగరానికి డెంటల్ (దంత), వెటర్నరీ కాలేజీలను మంజూరు చేశారు. ప్రస్తుత ఎంజీఎంను మాతాశిశు సంరక్షణ (ఎంసీహెచ్) కేంద్రంగా అభివృద్ధి చేసి ఒకేసారి 1500 మందికి సేవలందించేలా కొత్త భవనం నిర్మించాలనే ప్రణాళికలు ఉన్నాయి.



సూపర్ స్పెషాలిటీ దవాఖాన నమూనా చిత్రం

### పర్యావరణ హిత భవనం

ఈ భవనాన్ని పూర్తి పర్యావరణ హితంగా నిర్మిస్తున్నారు. వైద్య సేవల కారణంగా ఉత్పన్నమయ్యే వ్యర్థాల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మించనున్నారు. ఆహ్లాదకర వాతావరణం ఉండేలా గార్డెనింగ్ ఏర్పాటు చేయనున్నారు. డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది కోసం ప్రత్యేకంగా స్టాఫ్ క్వార్టర్స్ నిర్మించనున్నారు.

### 10 సూపర్ స్పెషాలిటీ విభాగాలు

హెల్త్ సిటీ ఆవరణలోనే కాకతీయ మెడికల్ కాలేజీ ఉన్నది. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు అనుబంధంగా ఈ కాలేజీ ఉండనున్నది. అన్ని రకాల వైద్య సేవలకు అనుగుణంగా అత్యాధునిక హంగులతో కొత్త హాస్పిటల్ భవనాన్ని నిర్మిస్తున్నారు. వైద్య సేవలకు సంబంధించి దాదాపు అన్ని డిపార్ట్‌మెంట్లు ఉండనున్నాయి. ఇందులో 35 విభాగాలు, 77 యూనిట్లు ఉంటాయి. రెండు వేల పడకలను ఏర్పాటు చేస్తారు. 500 మంది డాక్టర్లు, వెయ్యి మంది నర్సులు, పారా మెడికల్ సిబ్బంది సేవలందించనున్నారు. ఐదు అంతస్తుల్లో ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేస్తారు. ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. అవయవాల మార్పిడి కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నొస్టిక్స్, సర్జికల్, మెడికల్, ఐసీయూ విభాగాలు ఉంటాయి. శస్త్ర చికిత్సలు, అత్యవసర సేవల కోసం సెంట్రల్ స్టెరిలైజేషన్ యూనిట్‌ను నిర్మిస్తారు. రోగులు, డాక్టర్లు, వైద్య సిబ్బందికి సమయానికి ఆహారం అందించేందుకు సెంట్రల్ కిచెన్ ఉంటుంది.

... గోపాల్ పిన్నింటి

*తోటకూరా.. సుక్క కూరా.. టమాటలూ.. బీరకాయల్.. అగ్గువ అగ్గువ.. అని గట్టిగా రాగం తీస్తూ.. కూరగాయల గంప నెత్తిల వెట్టుకొనచ్చింది 65 యేండ్ల పెద్దవ్వ..*

ఆ అవ్వ కేక విని...
అవ్వా.. అవ్వా.. గా తోటకూరిచ్చిపో అని పిల్సిన..
ఇంటి ముంగటికచ్చి గంప దించింది.

*తోటకూర కట్టలు ఎంతకిస్తున్నవని అడిగిన. 20 రూపాలకు ఐదిత్త అన్నది. ఏ ఊరవ్వ మీది అంటే.. తోర్నాల.. సిద్దిపేట దగ్గెరుంటదన్నది.*

పేరడిగితే లచ్చవ్వని సెప్పింది..

*మారు బ్యారమా.. మీకు భూమి జాగుందా అంటే ఎందుకు లేదయ్యా.. ఐదెక్రాల జమీన్ ఉందయ్యాన్నది. మా జాగల వండిచ్చిందే అన్నది..*

మరి యేమేం వండిత్తవవ్వా అంటే..

## గా.. కాలేశుని నీళ్లే దిక్కయినయ్



మక్కశేను రెండెక్రాల్... వరి మూడెక్రాల్.. ఏశినగని.. ఏందవ్వ ఏమయ్యింది కనీ అంటున్నవ్ అన్న. మక్కశేనుల పెద్ద ఫాయిదా రాలేదు కొడుకా. అయినా సుట్టం లెక్క ఆపతికి సంపతి మోపయ్యిందయ్యా అన్నది. అగో గదేందవ్వ అన్న. గదే కేసీఆర్ సారు మనకు గిట్ల ఆపతొస్తే మా అసొంటోల్లు మొగులుకు శేతులువెట్టి ఏడ్వద్దని రైతుబంధు ఇత్తుండు గదా.. ఆ అయ్య కడుపు సల్లగుండ. పొద్దుగాల్లేశి ఆ అయ్య మొకం జూత్తే ఇంత అన్నం పుడుతది. అయ్యో అవ్వ మరి మక్కలు మంచిగ లేవన్నవ్ గదా.. మన కేసీఆర్ సారు కాళేశ్వరం నీళ్లత్తలేవ్వా అంటే..

*కొడుకా.. గా కాలేశుని (కాళేశ్వరం) కాల్వ నీళ్లే నాకు దిక్కయినయ్. అవి లేకపోతే శెర్ల శాపలు బయటవడుతుండె అన్నది. అవ్వా గట్లంటున్నవ్ ఏంది సంగతి అన్న.*

బిడ్డా.. ఆ అయ్యిచ్చిన నీళ్లతోనే ఇన్ని వడ్లెల్లుతున్నయ్. రేపు పుట్టి బతుక నేర్శినోల్లకు లీల్ల సొలత్ జేశిండు. ఏదున్న లేకున్న ఎవుసం జేసుకొని ఎట్లనన్న బతుకుతం. 24 గంటల ఫిరీ కరెంటు ఉండనే ఉండె.

*మరిప్పుడు ఒట్లచ్చినయ్ గదా.. కేసీఆర్ సారు ఏంజెయ్యలె ఆయనకెందుకు ఓటేసుడు? మాకెయ్యి ఓటు అని కాంగిరేసోల్లు అడుగుతుండ్రు గదా అంటే..*

ఆ అవ్వ.. ఆల్ల నోట్ల మన్నువొయ్య.. ఆల్లు సక్కగజేత్తే ఈ పాటికి మనం గొప్పగయ్యేటోల్లం గదా అన్నది.

మరిప్పుడు ఓటెవ్వలకేత్తవ్ అంటే కంచంల బువ్వయ్యిండు.. పొత్తుల సద్దయ్యిండు సారు. ఆయనగ్గాక పోతె ఇంకెవ్వలకు ఏశేది ఓటు. మల్లా ఆ అయ్యనే ఒత్తడు. అడిగినా అడగకున్న మస్తు సొలత్లు జేత్తడంటూ.. అంబటాల్లయ్యింది బిడ్డా ఇగవోతా అనుకుంటూ గంప నెత్తిల వెట్టుకొని వోయింది.


**- శారాశా (విశ్వామిత్ర), సిద్దిపేట**

# చెక్‌డ్యాంలు కట్టి.. నీటిని ఒడిసిపట్టి

*తెలంగాణకు ముందు యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గం కరువుతో తల్లడిల్లింది. వరుస కరువులతో జనం వలసలు వెళ్లిన దుస్థితి ఉండేది. స్వరాష్ట్రం సిద్ధించాక నియోజకవర్గ రూపురేఖలు అమాంతంగా మారిపోయాయి. కాళేశ్వరం జలాలతో పలు మండలాలు సస్యశ్యామలమయ్యాయి. బీడు భూముల్లో పుష్కలంగా ధాన్యం పండుతున్నది. ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి కృషితో నియోజకవర్గం అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నది.*

- 'ఆలేరు'లో సాగుకు జీవం పోసిన కాళేశ్వరం జలాలు
- ఇల వైకుంఠపురంగా యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం
- ప్రభుత్వ విప్ సునీత కృషితో నియోజకవర్గంలో ప్రగతి పరుగులు

**పొలిటికల్ షో : ఆలేరు**



లక్ష్మీనృసింహస్వామి ఆలయం

కాళేశ్వరం ప్రాజెక్ట్ ఫలాలు యాదాద్రి భువనగిరి జిల్లాను తాకాయి. సీఎం కేసీఆర్ అపర భగీరథుడై ఎక్కడో పారుతున్న గోదారమ్మను జిల్లా అంతటా ప్రవహింపజేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి కృషితో 2020లో బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాల్లో గోదావరి జలాలు పారించి రైతులకు కొత్త బతుకునిచ్చారు. బస్వాపూర్ రిజర్వాయర్ ద్వారా యాదగిరిగుట్ట నర్సన్న పాదాలను కాళేశ్వరం జలాలు ముద్దాడాయి. దేవాదుల ఎత్తిపోతలో భాగంగా నిర్మించిన నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి గుండాల మండలానికి గోదావరి జలాలను పారించారు.

### చెక్‌డ్యాంల నిర్మాణం.. చెరువుల పునరుద్ధరణ

గతంలో బుక్లేరు, చొల్లేరు, బిక్కేరు వాగులతో పాటు ఆలేరు పెద్ద వాగు, పెద్ద కందుకూరు వాగులో నీళ్లు వృథాగా పోయేవి. బోర్లు ఎండిపోయేవి. కేసీఆర్ పాలనలో ఆయా వాగులపై 23 చెక్‌డ్యాంలు నిర్మించారు. ఇటీవల మరో 11 చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మిషన్ కాకతీయ కింద 579 చెరువులు పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయి. చెరువులు, కుంటల ఆధునీకరణకు రూ.112 కోట్లు ఖర్చు చేశారు. మిషన్ భగీరథ ద్వారా 324 ఆవాస గ్రామాలకు..74,306 ఇండ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న 277 ట్యాంకులకు అదనంగా మరో 216 నిర్మించారు. 1,022 కిలోమీటర్ల మేర గ్రిడ్, పైప్‌లైన్ వేసి ప్రతి గ్రామంలో ట్యాంక్‌లు శుద్ధి చేసి గోదావరి, కృష్ణా జలాలను సరఫరా చేస్తున్నారు.

### మెడికల్ కాలేజీ.. డయాలసిస్ సెంటర్

**త్వరలో యాదగిరిగుట్టలో 20 ఎకరాల్లో మెడికల్ కాలేజీ నిర్మాణం కానున్నది. సెప్టెంబర్ 16న కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.183 కోట్లు కేటాయిస్తూ పాలనా అనుమతులను మంజూరు చేసింది. త్వరలోనే టెండర్ పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆలేరులో డయాలసిస్ సెంటర్ రోగుల పాలిట వరంగా మారింది.**

### అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధి

నియోజకవర్గంలో 3 గురుకుల పాఠశాలలు ఏర్పాటయ్యాయి. 98,519 మంది రైతులకు రైతుబంధు, 1,020 మంది రైతు కుటుంబాలకు రైతు బీమా అందింది. రూ.300 కోట్లతో కొత్త రోడ్లు నిర్మించారు. 15వేల మంది ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి సాయం అందింది. తుర్కపల్లిలో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు కోసం 93.21 ఎకరాల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యింది.

### యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం..

ప్రభుత్వం రూ.1,280 కోట్లతో యాదగిరిగుట్ట ఆలయాన్ని పునర్నిర్మించింది. 2015లో దసరా రోజున సీఎం కేసీఆర్ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టగా, 2022 మార్చి 28న ప్రధానాలయం పునఃప్రారంభమయ్యింది. ఆలయ నిర్మాణానికి 9.5 లక్షల ఘనపు మీటర్ల (2.5 లక్షల టన్నులు) కృష్ణశిలలను వినియోగించారు. ఆలయ గోపురాలు, మాడవీధులు, ప్రాకారాలు, గర్భగుడి, ధ్వజస్తంభం, శివాలయం, క్యూలు, వంటశాల, పుష్కరిణి, యాగశాలను నిర్మించారు. కొండపైన విష్ణు పుష్కరిణి, కొండ దిగువన లక్ష్మీ పుష్కరిణి, స్వామివారి తెప్పోత్సవం కోసం గండిచెరువు, కల్యాణ కట్ట, దీక్షాపరుల మండపం, నిత్యాన్నదాన సత్రం, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, ఆర్టీసీ, దేవస్థానం బస్టాండ్లు, గుట్ట చుట్టూ రెండు ఫ్లై ఓవర్లు నిర్మించారు.

### వాసాలమర్రిని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్న కేసీఆర్


తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిని సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్నారు. గ్రామంలోనే దళిత బంధును పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. 75 మందికి దళిత బంధు వర్తింపజేశారు. 75 మందికి ఇండ్లు కట్టించే ప్రక్రియ కొనసాగుతున్నది. ఇప్పటికే పలు ప్రభుత్వ భవనాలు నిర్మించగా, మిగతా పనులు కొనసాగుతున్నాయి.

... పున్న శ్రీకాంత్



తుర్కపల్లి మండలం గోపాలపురంలో పొలాలు

## సోషల్ యాంగిల్



### ఎలచ్చన్ల ఒంకతో..

*సత్తన్న: ఓ మల్లన్న.. నీకెప్పుడు ఆగమేనేమే.. ఆగు గీ ముచ్చటిన్రాదే..*
*ముత్తన్న: ఆ జల్దీ జెప్పు తమ్మీ ఏందో.. నాకు పనుంది*
*స: నీకే గంత పనుంటే.. రాష్ట్రాన్ని నడిపేటోళ్లకు ఇంకెంత పనుండాల్నే..*
*ము: ఎవల ముచ్చట తమ్మీ నువ్ మాట్లాడేది.. జర ఇవరంగా జెప్పు..*
*స: ఏ.. గా కన్నడోళ్ల గురించేనే.. ఊకే గీన్నే పాడైతుండ్రేమే..*
*ము: గాళ్లకేమన్న పనుంటే బాగుండు.. ఆడ కరెంటు లేక రైతులు గోస వడుతుంటే గీడ ఏం ఉద్ధరిస్తమని వచ్చిర్రో ఏమో..*
*స: 'మా రాష్ట్రానికొస్తే మా అభివృద్ధి సూపిస్తం' అని గా సిద్ధరామయ్య గప్పాలు గొడుతుండేమే మరి..*
*ము: అంతా ఉత్తదే తమ్మి.. కన్నడ రైతులొచ్చి వాళ్ల బాధలెల్లవెట్టుకోలే మొన్న.. మనం సూస్తిమి గదా, గాడ అభివృద్ధి ఉంటే సూసొద్దుమేమో.. లేకనేపాయె*
*స: మరి హాఫ్ సెంచరీ కన్న ఎక్కువ మంది ఎందుకొచ్చిన్రంటవ్..*
*ము: ఎలచ్చన్ల ఒంక వెట్టుకొని మన తెలంగాణ అభివృద్ధిని సూసిపోదామని వచ్చిండ్రేమో తీ తమ్మి..*
*స: అందుకే ఇంట్ల గెల్సి రచ్చ గెలవాల్నే.. గాళ్ల రాష్ట్రమే గట్లుండే.. ఇగ గీడేంజేస్తరు. గది గూడ దెల్వని సన్నాసులు ఒట్లడుగుతరట గీడ.. సరేతీయే ఉన్నంతసేపు మంచి ముచ్చట్లు జెప్పినవ్.. నీ పనిమీద నువ్ వో ఇగ..*

**- సురేందర్ బండారు**

## షహర్ కీ బాత్


### భూముల విలువ పెరిగింది



దశాబ్దాల నుంచి జరుగుతున్న అభివృద్ధి ఒక ఎత్తయితే... 10 ఏండ్లలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి మరో ఎత్తు. దేశంలోని మెట్రో నగరాలు, రాష్ట్రాలతో పోలిస్తే భూముల విలువ అత్యంత వేగంగా పెరిగిన రాష్ట్రం, నగరం మన హైదరాబాదే. ఉద్యోగ, ఉపాధి కల్పనలో టాప్. ఆఫీస్ స్పేస్‌కు భారీస్థాయిలో డిమాండ్ పెరిగింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆధునీకరణ మన ప్రభుత్వ ఘనతే. అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి అంతర్జాతీయ కంపెనీలు వరుస కట్టాయి. ముమ్మాటికీ తెలంగాణ వచ్చినంకనే రాష్ట్ర ప్రగతి ఊపందుకున్నది. నూటికి నూరుశాతం మన ఓటు కారు గుర్తుకే వేయాలి.

**- పుల్లన్నగారి భాస్కర్‌రెడ్డి, అల్వాల్**

### ఐటీ పార్కులకు హబ్



తెలంగాణ ఏర్పాటైన పదేండ్లలోనే హైదరాబాద్ ఐటీ పార్కులకు హబ్‌గా మారింది. ఐటీతో పాటు అనేక రంగాల్లో పరిశ్రమలను నెలకొల్పి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలతో పాటు ఉపాధి కల్పించిన నగరంగా చరిత్రకెక్కింది. ఒకప్పుడు ఐటీ అంటే బెంగళూరు అని చెప్పుకునేటోళ్లు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బెంగళూరును పక్కకు నెట్టేస్తూ అనేక ఐటీ కంపెనీలు ఏర్పాటవుతుండటంతో దేశంలో టెకీలు హైదరాబాద్ వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్‌లో అన్ని మౌలిక సదుపాయాలున్నాయి.

**-సందీప్, ప్రైవేట్ ఉద్యోగి, సికింద్రాబాద్ కంటోన్మెంట్**